# అమ్మదేవత

అటూ, ఇటూ పచ్చటి మైదానాలు...

ఏపుగా పెరిగిన చెట్లు, మధ్యలో తారు రోడ్డు మీద స్వరాజ్ మజ్దా వేగంగా వెళ్తోంది.

దాదాపు పదిహేనుమంది విద్యార్థినీ, విద్యార్థులు హుషారుగా పాటలు పాడుతూ, లయబద్ధంగా చప్పట్లు కొడుతూ, అల్లరి చేస్తూ, ప్రపంచంలో వున్న ఆనందానికంతా మేమే సర్వాధికారులం అన్నట్లు అల్లరిచేస్తున్నారు.

దూరంగా పశ్చిమకొండల చాటుకి పయనం అవుతున్నాడు సూర్యుడు లేత నారింజరంగు కిరణాలు ప్రసరిస్తూ.

కిటికీ పక్కనే కూర్చుని, మనోహరమైన దృశ్యాలను చూస్తోన్న రచన ఉన్నట్టుండి గట్టిగా అరిచింది 'స్టాప్' అంటూ.

ఒక్కసారిగా పాటలు, చప్పట్లు ఆగిపోయాయి. అందరూ రచనకేసి వింతగా చూశారు ఏం జరిగింది? అంటూ.

''బస్సు ఆపమను శ్రీధర్'' అన్నది అదుర్దాగా రచన శ్రీధర్ అనే విద్యార్థిని చూస్తూ.

శ్రీధర్ సీట్లోంచి లేచి, డ్రైవర్ కాబిన్ దగ్గరికి వెళ్ళి, ''డ్రైవర్ బస్సాపండి'' అన్నాడు గట్టిగా.

డ్రైవర్‌తలతిప్పి శ్రీధర్‌కేసి ప్రశ్నార్థకంగా చూస్తూ, బస్సు స్లో చేశాడు కొంచెం ముందుకి వెళ్ళి ఓ పక్కగా ఆపి ' ఏమయింది' అని అడిగాడు.

అందరూ రచనవైపు చూశారు. రచన సీటులోంచి, డోర్ దగ్గరికి నడిచి, డోర్ లోనుండి, తల బైటికి వంచి, దూరంగా చూస్తూ అన్నది, 'అక్కడ కొండమీద ఒక గుడి కనిపించింది. చాలా మంది జనం కొండ ఎక్కుతూ కనిపించారు మనం ఆ గుడి ఏంటో చూడాలి' అన్నది.

స్టూడెంట్స్ అంతా విసుగ్గా చూశారామెవైపు '' ఏంటి రచనా! మనదేశంలో అడుగడునా గుళ్ళు, గోపురాలున్నాయి.. అన్నీ ఎక్కడ చూస్తాం? ఇంపార్టెంట్ ప్లేసెస్ చూశాం కదా!'' అన్నది జోత్స్న.

''అవును. ఇప్పటికే వారం దాటింది-- ఇలా పసుపు రాసిన ప్రతి రాయినీ, బొట్లు పెట్టిన ప్రతీ చెట్టునూ పుణ్యక్షేత్రంగా భావిస్తే మన రీసెర్చ్ పూర్తయ్యేప్పటికి ఓ జీవితకాలం పడుతుంది'' అన్నది రాధ.

''నో... అదేంటో చాలా విచిత్రంగా అనిపించింది నాకు. ఎంతసేపూ మహా అయితే ఒక గంట పడుతుంది. వెళ్ళి చూద్దాం శ్రీధర్! బస్సు వెనక్కి త్రిప్పమను'' మొండిగా అన్నది రచన.

''ఇలాంటి చిన్న చిన్న ప్రదేశాల్లో గైడ్స్ కూడా ఉండరు. మనకి ఆ గుడిని గురించిన ప్రాధాన్యత, ప్రాశస్త్యం, దాని కథ, కమామీషు చెప్పడానికి ఎవరుంటారు'' అన్నాడు రవి.

''చూద్దాం ఎవరో ఒకరు చెప్తారులే ఇలాంటి గుళ్ళకే ఇంట్రస్టింగ్ స్టోరిస్ ఉంటాయి వెళ్దాం''. అన్నది రచన.

ఇంకా కొందరు కూడా ''వెడదాం, వెడదాం'' అనడంతో శ్రీధర్ డ్రైవర్‌ని బస్సు రివర్స్‌చేయమని చెప్పాడు.

డ్రైవర్ బస్సు రివర్స్ చేసి నెమ్మదిగా, కొంచెం వెనక్కి పోనిచ్చి తిరిగి ముందుకు నడిపాడు. అప్పటికే ఆ కొండ దాటి చాలా దూరం రావడంతో ఆ కొండవైపు వెళ్ళడానికి పదినిమిషాలు పట్టింది. అయితే కొండ దగ్గరికి వెళ్ళడానికి మధ్యలో జొన్నచేలు ఉన్నాయి. చేల మధ్యలో సన్నని కాలిబాట ఉంది. ఆ కాలిబాట వెంబటి నడిచి కొండదగ్గరికి వెళ్ళాలి. బస్సుని ఓ పక్క ఆపాడు డ్రైవర్. అందరూ బిలబిలలాడుతూ దిగి చేలవైపు నడిచారు. చల్లని గాలికి చేలు సుతారంగా కదులుతూంటే ఆ కాలిబాటనుంచి నడుస్తున్నవారి అందరికీ ఆ అనుభూతి ఎంతో అద్భుతంగా అనిపించింది. పదినిమిషాలు నడిచాక ఒక రాళ్ళ గుట్ట కనిపించింది. ఆ రాళ్ళ గుట్ట మీది నుంచి కొండపైకి ఎక్కుతున్నారు గ్రామస్తులు కొందరు. ఆ రాళ్ళ గుట్ట వెనకాల చిన్న కాలనీల ఉంది. ఆ కాలనీ ఓ కుగ్రామం అని అర్థమైంది అందరికి. అక్కడి నుంచి చూస్తుంటే ఆ గ్రామంలో ఉన్న పెంకుటిళ్లన్ని బొమ్మరిల్లులా కన్పిస్తున్నాయి.

''అమ్మో ఈ రాళ్ళ గుట్ట ఎక్కాలా? నా వల్ల కాదు బాబూ''! జ్యోత్స్న అన్నది.

''నా వల్లకూడా కాదు, కాళ్ళు బాగా నొప్పిగా ఉన్నాయి'', అన్నది రాధ.

''ఓ పనిచేయండి, ఇద్దరో, ముగ్గురో వెళ్ళి డీటైల్స్ రాసుకురండి. అందరూ కాపీ చేసుకుందాం.''

ఐడియా బాగానే వుంది, ఎవరెవరు వస్తారు?'' అడిగాడు శ్రీధర్

రచన, రాజన్, వంణి, శ్రీధర్, శ్రీవాత్సవ వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు. వాళ్ళునెమ్మదిగా గుట్ట ఎక్కబోతుంటే ''జాగ్రత్త త్వరగా వచ్చేయండి మళ్ళీ చీకటి పడుతుంది'' అన్నారు మిగతావారు.

''అలాగే!'' రచన సమాధానం ఇస్తూ చకచకా గుట్టపైకి వెళ్ళసాగింది. రెండుసార్లు జారడంతో చెప్పులు విప్పి కిందకి విసిరి పైకి ఎక్కింది. ఆమెని అనుసరించారు మిగతా ముగ్గురూ.

వాళ్ళు అలా ఎక్కడం చూసిన లత అన్నది ''పోయి పోయి ఈ సబ్జెక్ట్ ఎందుకు తీసుకున్నామో రీసెర్చ్‌కి.''

''భారతదేశం పవిత్రదేశం. ఇచ్చట ఎన్నో జీవనదులు, పుణ్యక్షేత్రములు కలవు అని థీసిస్ సబ్‌మిట్ చేస్తే ఎలా ఉంటుంది?'' అన్నది జోత్స్న.

''వెళ్ళి ఎల్.కె.జి లో కూర్చో అమ్మా!'' అంటూ నవ్వాడు గోపి. మళ్ళీ అందరూ రచన వాళ్ళు వెళ్ళినవైపు చూశారు. అప్పటికే నలుగురూ కొండపైకి చేరి వీళ్ళని చూసి చేయి ఊపారు. రచన విసురుగా వీస్తున్న గాలికి చున్నీ ఎగిరిపోతుంటే మెడ చుట్టు త్రిప్పి వేసుకుని చుట్టూ చూసింది.

దాదాపు పాతిక ముప్పై మంది స్త్రీలు, పురుషులు, పిల్లలు , కుర్రాళ్ళు కొండపైకి ఎక్కి గుడి దగ్గరికి చేరారు. కొండ చెక్కి గుడిగా మలిచినట్టుగా ఉంది. ఒక మనిషి మాత్రం లోపలికి వెళ్ళవచ్చు. లోపల చీకటిగా ఉంది. విగ్రహం కనిపించడం లేదు. ఓ వెడల్పాటి మట్టి మూకుడులో నూనె దీపం వెలుగుతోంది. ఆ లేత వెలుగులో చిన్న రాతి పలక ఉంది. దానికి పసుపు రాసి చామంతి పూల దండలు వేసి వున్నాయి. ఆ రాతి పలక ఎదురుగా పెద్ద ఇత్తడి పళ్ళెంలో ఐదారు అన్నం ముద్దలు ఉన్నాయి. అక్కడికి చేరిన వారంతా మూటలలో కట్టుకొచ్చిన అన్నం ముద్దలు ఆ పళ్ళెంలో వేసి సాష్టాంగ పడి దండాలుపెడుతున్నారు. చూస్తుండగానే ఇత్తడి పళ్ళెంలో చాలా అన్నం ముద్దలు చేరాయి.

రచన, శ్రీధర్ వింతగా చూస్తూ నిలబడి పోయారు. రాతి పలకకి మొక్కడమా? అదీ ఇంత ఎత్తున ఉన్న కొండపైకి ఎక్కి కేవలం అన్నం ముద్దలు పెట్టడానికా? నైవేద్యం అంటే పండో, పాలో పెడుతారు. లేదంటే కొబ్బరికాయ కొడతారు. ఇదేం ఆచారం! గుడికి చాలా చిన్నతలుపు ఉంది. ఆ తలుపు కొంచెం ఎడంగా ఓ వృద్ధురాలు కూర్చుని ఉంది. చూడగానే యాచకురాలు అన్నట్లు తెలుస్తుంది. ముడతలు పడిన శరీరం, గుంటలు పోయిన కళ్ళు, పెదాలు వణుకుతున్నాయి.

జుట్టంతా తెల్లగా, ముగ్గుబుట్ట బోర్లించినట్టు ఉంది. ఆమె కూర్చున్న స్థలంలో అక్కడక్కడ అర్ధరూపాయి, పావలాలు పడి ఉన్నాయి. వాటివైపు ఆసక్తి లేనిదానిలా ఎటో చూస్తూ కూర్చుంది ఆమె. ఆమె వైపు ముగ్గురూ వింతగా చూశారు. ఈ ముసలమ్మ కొండపైకి ఎలా ఎక్కింది. తిరిగి ఎలా దిగుతుంది? అనుకున్నారు.

''ఈ దేవత పేరేంటో, అసలు దేవతా? దేవుడా? ఈ గుడి ఏ కాలం నాటిదో'' అన్నాడు శ్రీవాత్సవ్.

''ఈ విషయాలు చెప్పేవారు లేరనేగదా వద్దన్నది. ఇప్పుడు ఎవరు చెబుతారు?'' అన్నది మణి. ''చూద్దాం ఎవర్నన్నా అడుగుదాం'' అంటూ రచన, శ్రీధర్ ముందుకు నడిచి అన్నం ముద్ద వేసి గుళ్ళో నుంచి బయటకు వస్తున్న ఓ స్త్రీ దగ్గరికి వెళ్ళి అడిగారు. ఈ దేవత పేరేంటమ్మా?''

''అమ్మ దేవత'' చెప్పిందామె.

''అమ్మ దేవతా– అదేం పేరు?'' ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

ఇంతలో అటుగా వచ్చిన ఇద్దరు వ్యక్తులను ఆపి అడిగాడు రాజన్. ''మీరు మొక్కే ఈ దేవుడి పేరేంటి?''

''అమ్మ దేవత'' అదే సమాధానం చెప్పి వాళ్ళూ కళ్ళు మూసుకుని దణ్ణం పెట్టుకోసాగారు. ''అనవసరంగా మనం ఇంతదూరం వచ్చాం. ఇదేదో మూడనమ్మకం తాలుకు గుడి, పెద్ద విశేషం ఏమి లేదు'' అన్నాడు రాజన్.

''ఎందుకుండదూ? ఉంటుంది. సమ్మక్క, సారక్క అనే ఫిక్షన్ అనుకున్నా దానికో కథలేదూ... అలాగే దీనికి ఉంటుంది. ఈ గ్రామ ప్రజలు కొలుచుకునే దేవత గ్రామ దేవత కాకపోతే ఇంత ఎత్తుమీద గుడి ఎందుకు ఉంటుంది. వెలసిన గుడో, గుడి కట్టి ప్రతిష్టించారో తెలుసుకోవాలి'' అన్నది రచన.

''అబ్బా? పోనీద్దు రచనా అన్నీ తెలుసుకుంటావామా ఏంటీ వెళ్ళిపోదాం చీకటి పడుతోంది, నాకూ భయం వేస్తోంది అన్నది మణి.

''తెలుసుకోవాలి. చరిత్రకందని ఇలాంటి వింతలు, విశేషాలు తెలుసుకుని వీటి గురించి రాస్తేనే అది రీసర్చ్ అవుతుంది. అసలీ అన్నం ముద్దలు సాంప్రదాయం ఏమిటో తెలుసుకోవాలని ఉంది. ఈ గుడి కట్టడమే చిత్రంగా ఉంది– ఈ విగ్రహం ఎవరు చెక్కి ఉంటారో!''.

''నువ్వు అవన్నీ తెలుసుకుని రా తల్లి. నేను దిగిపోతాను. చీకటి పడితే పాములే వస్తాయో, దయ్యాలే తిరుగుతాయో నాకింకా బ్రతుకు మీద ఆశ ఉంది. నాతో ఎవరన్నా వస్తారా?'' అడిగింది మణి.

రాజన్ మణితో బయలుదేరాడు. ఇద్దరూ కలిసి కొండదిగడం ప్రారంభించారు.

రచన మళ్ళీ ఒక్కసారి కలియతిరిగి చూసింది. దాదాపు అందరూ వెళ్ళిపోయారు. ముసలమ్మ ఒక్కతి కూర్చుని ఉంది. మరో ఇద్దరు యువకులు అప్పుడే పైకి వచ్చారు. వాళ్ళను సమీపించి అడిగింది రచన. ''చూడండి ఈ గుడికి ఏదన్నా కథ ఉందా?'' వాళ్ళు రచనవైపు ఆమె ప్రక్కన ఉన్న శ్రీధర్, శ్రీవాత్సవ్‌ల వైపు చూసి ''మాకు తెలియదండి. మా పెద్దవాళ్ళు ప్రతి నెల పౌర్ణమి నాడు సాయంత్రం ఇక్కడ నూనెదీపం పెట్టి అన్నం ముద్దలు నైవేద్యం పెడుతారు. అందరం వచ్చి ఈ రోజున ఈ అమ్మదేవతకు మొక్కి వెడితే కోరికలు తీరుతాయి అని అంటారు. ఇవాళ మాగ్రామంలో జాతర. ప్రతినెలా పౌర్ణమి రోజున ఈ జాతర జరుగుతుంది'' అన్నారు వాళ్ళు. ''అంటే రోజూ ఇలా దీపంపెట్టడం, నైవేద్యం పెట్టడం చేయరా?'' ఆశ్చర్యంగా చూశారు ముగ్గురూ.

''లేదండీ! అదీ సంధ్యాదీపమే పెడతారు. ఈ రాత్రంతా వెలుగుతుందీ దీపం. మళ్ళీ రేపు గుడి మూసేస్తారు. ఇప్పుడు కాసేపు అయ్యాక, చంద్రోదయం అయ్యాక అమ్మదేవత వచ్చి ఈ అన్నం ముద్దలు తినేస్తుంది. మీరుచూస్తే భయపడతారు వెళ్ళిపొండి. మా గ్రామస్తులే ఎవరం ఉండం.''

ఈ అన్నం ముద్దలు దేవత తింటుందా? ''స్ట్రేంజ్!'' అద్భుతం ఏదో విన్నట్టుగాఅన్నది రచన. చూడాల్సిందే ఈ విచిత్రం అన్నాడు శ్రీవాత్సవ్. అవును చూడాలి అన్నాడు శ్రీధర్.

''వద్దండి వెళ్ళిపోండి అమ్మవారు ప్రసన్నంగా రాదు. రౌద్రరూపంలో వస్తుంది'' అన్నారు ఆ యువకులు.

''ఫర్వాలేదు మీరు వెళ్ళండి'' అన్నారు ముగ్గురు. వాళ్ళు భుజాలు ఎగరేసి ''మీ ఇష్టం'' అంటూ కొండ దిగి వెళ్ళిపోయారు.

బాగా చీకటి పడింది. కింద నుంచి చప్పట్లు వినిపించాయి. ముగ్గురూ సమాధానంగా తిరిగి చప్పట్లు కొట్టారు.

రచన ముసలమ్మ దగ్గరికి వెళ్ళి ఆమె ప్రక్కన చతికల బడి నెమ్మదిగా అడిగింది. ''అవ్వా! నువ్వు పెద్దదానివి ఈ కొండమీదికి ఎలా ఎక్కావు?'' ఆమె మాట్లాడలేదు.

''బాగా చీకటి పడింది. అమ్మవారు వస్తుందట కదా? నీకు భయంలేదా? కిందకు వెళ్ళవా?'' అడిగింది మళ్ళీ.

ఆమె తలెత్తి రచనవైపు చూసింది. ఆమె జీవంలేని కళ్ళల్లో చిన్న చిరునవ్వు విరిసింది. తల అడ్డంగా ఊపి అన్నది ''దేవతని చూసి భయపడతారా?''

రచన, శ్రీధర్, శ్రీవాస్తవ తెల్లబోయారు. ఎంత స్పష్టంగా ఉంది ఈమె మాట తీరు.

''అవ్వా! నిన్ను ఎవరన్నా ఇక్కడికి తీసుకువచ్చారా? మళ్ళీ వచ్చి తీసుకువెళ్తారా?'' అడిగాడు శ్రీధర్.

ఆమె తల ఊపి అన్నది. ''లేదు బాబు ఇది నా ఇల్లు, ఈ కొండే నా వాకిలి. ఈ చెట్లు, ఈ గుడి ఇవన్నీ నా చుట్టాలు. నేను పాతికేళ్ళుగా ఇక్కడే ఉంటున్నాను.''

''మై గాడ్'' ముగ్గురూ ఒకేసారి అన్నారు.

''ఈ దేవత పేరూ, గుడి ఎలా వెలిసింది చెప్పగలవా?'' అడిగారు.

మళ్ళీ కొన్ని క్షణాలు మౌనంగా ఉండి ''చెబుతాను'' అన్నది అవ్వ.

ముగ్గురూ ఆత్రుతగా ఆమె మొహంలోకి చూస్తూ కూర్చున్నారు.

అదిగో ఆ కనిపించే గ్రామంలో ఒకే ఒక సంపన్న కుటుంబం ఉండేది. ఉన్న ఒక్క డాబా ఇల్లు వాళ్ళదే. వాళ్ళకు ముగ్గురు మగపిల్లలు, నలుగురు ఆడపిల్లలు ఉండేవాళ్ళు. ఆడపిల్లలు పెళ్ళిళ్లై వారి భర్తలతో కలిసి తల్లి దండ్రుల దగ్గరే ఉండేవారు. ఆడపిల్లలు ఎలిమెంటరి స్కూలు చదువు చదివి ఆపేస్తే

ముగ్గురు మగపిల్లలు మాత్రం పట్నంలో కాలేజీ చదువు చదివారు. కాకపోతే ఉద్యోగాలు చేయకుండా వ్యవసాయం చేసుకునే వాళ్ళు. ముగ్గురికి ముగ్గురు వ్యసనపరులే. తండ్రి కూడా వ్యసనపరుడే. తండ్రికొడుకులూ కలిసి ఇంట్లోనే ఎన్నెన్నో చెండాలపు పనులు చేసినా ఆడవాళ్ళు మాట్లాడేవారు కాదు. ఊరు అభివృద్ధి చెందడం ఆ కుటుంబానికి ఇష్టం ఉండేది కాదు. అందుకే కరెంటు గానీ, ఇతర సదుపాయాలు గానీ, ఏవీ ఉండేవి కావు. ఒక ఆస్పత్రి కానీ, హైస్కూల్ గానీ ఉండేది కాదు. ఆ ఊళ్ళో ఎవరూ కూడా వీళ్ళకి పోటీగా ఉండకూడదు. అందరూ వీళ్ళకన్న తక్కువ స్థాయిలో ఉండాలి.

సుమారు ముప్పై ఏళ్ళ క్రితం పెద్దకొడుకు అరుణాచలానికి పెళ్ళి చేశారు. పేద ఇంటి పిల్లని అందమైందీ, సుగుణవతి, పైగా చక్కని పనిమంతురాలని కట్నం కోరకుండా ఇంటి కోడల్ని చేసుకున్నారు. అయితే పెళ్ళయ్యి ఆ పిల్ల కాపురానికి వచ్చింది మొదలు అత్తగారు ఆడపడుచులు, మామగారు, భర్త అంతా కలిసి ఆ పిల్లని పనిమనిషికన్నా హీనంగా చూసేవారు. ఇంటెడు చాకిరి చేయించేవారు. కోడలంటే ఇంట్లో చాకిరి చేసేది అనివారి అభిప్రాయం. తిండి సరిగా పెట్టే వారు కాదు. ఆ పిల్ల తల్లిదండ్రులు కూతుర్ని చూడటానికి వస్తే కూడా రానిచ్చే వాళ్ళు కాదు. మీ కూతురు మా ఇంటికి వచ్చాక మీకేమి సంబంధం లేదని ఆ పిల్ల తల్లిని అవమానించి పంపించారు. అదేంటని అడిగినందుకు సంధ్య ఒంటిమీద వాతలు పెట్టారు. అంతో, ఇంతో చదువుకున్న పిల్ల కావడం చేత ఆ బాధలు భరించలేక ఇంటి నుంచి పారిపోవడానికి ప్రయత్నించి ఓ అర్ధరాత్రి పారిపోతూ మామగారి కంట పడింది. అందుకు శిక్షగా ఆమెను రెండు నెలల పాటు చీకటి గదిలో బంధించి, రెండే రెండు రొట్టెలు పెట్టి గదిలోంచి బయటికి రాకుండా చేశారు. ఆ పిల్ల గదికి ఉన్న గవాక్షంలో నుంచి దారిన పోయే ఊరివాళ్ళందరిని పిలిచి తనని రక్షించమని గోల చేసేది. కానీ ఆ కుటుంబానికి వ్యతిరేకంగా ఏ పని చేసే ధైర్యం లేని ఆ ఊరి ప్రజలు ఏం చేయలేక పోయారు. ఆ పిల్ల అలా రెండు నెలల పాటు ప్రతి రోజూ తప్పించుకుందామనే చూసింది. ఓసారి స్పృహ తప్పి పడిపోతే ఆమెను బయటకు ఈడ్చుకొచ్చి బాగా కాలిన గరిటెతో వాతలు పెట్టారు. ఆ మంటలకి పిల్ల లేచి, హాహా కారాలు చేసింది. నోరు మూసి బలవంతంగా మజ్జిగ అన్నం తినిపించారు. మరునాటి నుంచి మళ్ళీ ఇంట్లో చాకిరి చేయించడం ప్రారంభించారు. ఓసారి ఆ ఊరికి ఒక ఎమ్మెల్యే గారు వచ్చారు. ఆ పిల్ల ఎలాగైనా ఆయన్ని కలుసుకుని తన దీనగాథ చెప్పుకుని

రక్షణకోరడానికి నిశ్చయించుకుంది. మంచినీళ్ళకని చెరువుకు బయలుదేరి ఎలాగో ఎమ్మెల్యే గారిని కలుసుకుని తనను రక్షించమని వేడుకుంది. ఆయన ఆ పిల్లను వెంటబెట్టుకుని తిరిగి ఆ ఇంటికి వెళ్ళి మామగారిని పిలిచి సంజాయిషి అడిగాడు.

ఆ పిల్లకి మతిస్థిమితం లేదని ఎమ్మెల్యే గారిని ఇబ్బందిపెట్టినందుకు క్షమించమని కోరి ఆ తర్వాత ఆ పిల్లని నానా హింసలు పెట్టారు. ఆమె ఇంట్లోంచి పరుగెత్తుకొచ్చి గ్రామప్రజలందర్నీ పేరుపేరున సహాయం కోరింది. తనను రక్షించమని వేడుకుంది. కాని ఎవరూ ఆమెని రక్షించడానికి ముందుకు రాలేదు. తిరిగి దాదాపు ఏడాదిపాటు చీకటి గదిలో బంధించబడింది. మాట్లాడటానికి మనిషిలేక, కళ్ళకు వెలుతురు లేక, తిండి లేక ఓ జీవచ్ఛవంలా ఉండిపోయిన ఆ పిల్ల మాట్లాడటం మర్చిపోయింది. ఆమె కళ్ళు వెలుతురుని చూడలేక మూసుకుపోయాయి. ఆమె భర్త మరో వివాహం చేసుకున్నాడు. జమీందారి పిల్లని చివరికి శుష్కించి చావుకు దగ్గరైన సంధ్య పరిస్థితి చూసిన సవతి ఆమె దైన్యస్థితికి జాలి పడింది. కొన్నాళ్ళ పాటు రహస్యంగా ఆమెకు అన్నం పెట్టింది. ఓ రోజు తనను ఆ గదిలోంచి బయటపడేయమని అడిగింది సవతిని. అందుకు అంగీకరించిన ఆమె ఎవరూ చూడకుండా ఆమెని బయటికి పంపించింది. నడవడానికి కూడా శక్తి లేని ఆ తల్లి నేలమీద పాకుతూ వీధిలోకి వచ్చింది. కనిపించిన ప్రతివ్యక్తిని కాపాడమని అర్థించింది. ఎలా చూశాడో ఆమెభర్త హంటరుతో ఆమెను చితకబాదాడు వీధిలోనే. ఆ దెబ్బలకి ఆ పిల్ల స్వరం వణికిపోతూంటే ముసలమ్మ మాటలు ఆపేసింది.

రచన చెంపలమీద కన్నీటి ధారలు కట్టాయి. శ్రీధర్, శ్రీవాత్సవ్‌ల మనస్సు చెదిరిపోయింది. రుద్రమైన కంఠంతో అన్నది రచన. ''ఆపిల్ల చచ్చిపోయిందా అవ్వా?''

''హు.. అక్కడికక్కడికే రక్తం కక్కుకొని పడిపోయింది. అట్టా పడిపోయిన ఆ పిల్లని భర్త, మరుదులు తీసుకొచ్చి ఊరికి దూరంగా పడేసి వెళ్ళిపోయారు. ఇంటికి వెళ్ళి పాలేరును పంపించి దహనం చేసిరమన్నారు. అయితే చాలా విచిత్రమైన సంఘటన జరిగింది వెంటనే.''

''ఏం జరిగింది?'' ఆత్రంగా అడిగారు ముగ్గురూ.

''ఆ పాలేరు శవంకోసం అటు ఇటూ కలియ తిరిగి చూస్తుండగానే అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. చూస్తుండగానే

అది పెద్ద తుపానుగా మారింది. తుఫాను తాకిడికి చాలా మంది ప్రజలు కొట్టుకుపోయారు. ఆ కుటుంబానికి పంటనష్టం జరిగింది. ఎన్నో ఇళ్ళు మునిగిపోయాయి. మూడు రోజుల పాటు భీభత్సం సృష్టించిన ఆ తుఫానుకు కారణం ఆ పిల్లని పెట్టిన ఉసురని గ్రామప్రజలు నమ్మారు. ఆమెను దహనం చేయడానికి వెళ్ళిన పాలేరు జాడలేకపోవడంతో అంతా ఆమె మహిమగా చెప్పుకున్నారు. ఆ పిల్లని దేవతగా భావించి ఆమెకి అన్యాయం చేసినందుకు అరిష్టాన్ని సృష్టించిందని నమ్మి, తమని క్షమించి కాపాడమని ఊరిమీద ఆగ్రహం చూపించవద్దని ప్రార్ధనలు, శాంతి పూజలు, జంతుబలులు చేశారు. గ్రామస్తులు అందరూ కలిసి ఆ కుటుంబం మీద దాడి చేశారు. వారు చేసిన అన్యాయానికి, అకృత్యాలకు ఊరు ఊరంతా బలైపోయిందని, వాళ్ల ఆ ఊరు నుండి వెళ్ళకపోతే వాళ్ళ ఇళ్ళు తగలబెడతామని హెచ్చరించారు. ఒక్కసారిగా గ్రామస్తులంతా తిరగబడే సరికి ఆ ఇంటి యజమాని గుండె నొప్పితో మరణించాడు. ఆ ఇంట్లో ఆడవాళ్ళంతా కూడా ఈ అరిష్టానికి కారణం తాము కోడలికి పెట్టిన ఉసురు అని నమ్మారు. వాళ్ళు కూడా గ్రామస్తులతో కలిసి పూజలు చేశారు. మూడో రోజుకి ప్రకృతి శాంతించింది. ఆ తర్వాత ఆ కుటుంబం ఊరొదిలి ఎటో వెళ్ళిపోయింది. గ్రామస్థులు మాత్రం ఆ ఇంటి పెద్ద కోడల్ని గ్రామదేవతగా భావించి ఏ ప్రదేశంలో ఆ పిల్ల శవాన్ని పడేశారో ఆ ప్రదేశాన్ని పవిత్రమైన స్థలంగా భావించి, పూజించడం ప్రారంభించారు. అదే ఈ కొండ. శవాన్ని దహనం చేయడానికి వెళ్ళిన పాలేరు గాని, శవం గానీ కనిపించకపోవడంతో చనిపోయిన పిల్ల దేవతగా మారిందని కొండపైన గుడికట్టుకుని వెలిసిందనీ, తనని దహనం చేయడానికి వచ్చిన పాలేరుని చంపేసిందని గ్రామస్థులు భావించారు. ఆ పిల్ల చనిపోయిన రోజు పౌర్ణమి కావడంతో పైగా ఆమె తిండి, నీళ్ళు లేక చనిపోవడంతో అన్నం ముద్దలే ఆమెకు నైవేద్యంగా సమర్పిస్తూ ప్రతి నెల పౌర్ణమి రోజున సరిగా ఆమె చనిపోయిన సమయానికి దీపం వెలిగించి పూజలు చేస్తున్నారు. దానినే ఆచారంగా నమ్ముతున్నారు. ఆ తర్వాత గ్రామంలో చాలా మార్పులు వచ్చాయని గ్రామం అభివృద్ధి చెందిందని వాళ్ళ నమ్మకం.'' అవ్వ చెప్పడం ముగించింది.

హృదయవిదారకమైన ఆ గ్రామదేవత కథ విన్నాక ఆ ముగ్గురికి శక్తి నశించినట్లుగా అనిపించింది. ''అవ్వా నీకు ఆ పిల్ల తెలుసా?''

అవ్వ తల పంకించింది. కొన్ని క్షణాల నిశబ్దం తర్వాత అన్నది. ''తెలుసు..''

''నిజంగానే ఆమె ఇప్పుడు వచ్చి అన్నం ముద్దలు తింటుందా? ''

''తింటుంది, ఆమె తినేది నెలకోసారే, ఈ అన్నం ముద్దలే ఆమెని పాతికేళ్ళనుంచి రక్షిస్తున్నాయి. ఆమె ప్రాణాలు నిలబెడుతున్నాయి.''

''అదేంటి? ఆమె చచ్చిపోయింది కదా!'' నివ్వెరపోతూ చూశారు.

''లేదమ్మా? ఆమె చచ్చిపోలేదు బతికే ఉంది.''

''అవునా? మరి ఈ గుడి ?''

''ఇదే ప్రజల మూర్ఖత్వానికీ, మూఢ నమ్మకాలకీ ప్రత్యక్ష సాక్ష్యం.''

''బ్రతికి ఉన్నంత కాలం ఆమెని ఎవ్వరూ కనీస మానవత్వం చూపించి, కాపాడలేకపోయారు. చచ్చిపోయిందని తెలిసాక యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనకి, ఆమె చావుకి ముడిపెట్టారు. ఏ పాలేరునైతే శవాన్ని దహనం చేయమని పంపించారో ఆ పాలేరే ఆమెని రక్షించాడు. అతను అక్కడికి వెళ్ళేటప్పటికి ఆమె కొనప్రాణంతో కొట్టుకొంటుంది. ఆమెని ఎత్తుకుని ఈ కొండ మీద ఈ గుహలో పడుకోబెట్టి, సేవలు చేసి, కంటికి రెప్పలా ఎవరి కంటా పడకుండా కాపాడాడు. గ్రామానికి వెళ్ళి తినుబండారాలు తీసుకువచ్చి ఆమె ప్రాణాలు నిలబెట్టాడు. రెండు నెలల పాటు ఆమెకి తోడుగా ఉండి మానవత్వం చాటుకున్నాడు. ఓ రోజు గ్రామం తిరిగిరావడానికి పొద్దు పోయింది. చీకటిలో వస్తుంటే పాము కరిచింది. అక్కడిక్కడే ప్రాణాలు విడిచాడు. ఆ తర్వాత ఆమె గ్రామస్థుల కంట బడకుండా ఆ కొండ మీద బతుకుతూ, వచ్చిన ప్రతి పౌర్ణమికి గ్రామ ప్రజలు పెట్టే ఆ ముద్దలతో ప్రాణాలు కాపాడుకుంటోంది''.

''అయితే.. అయితే.. ఆమె ఇప్పుడు ఇక్కడికి వస్తుందా? మేము ఆమెని చూడవచ్చా?''

''చూడవచ్చు ఆ సంధ్యను నేనే!''

ముగ్గురూ అదిరిపడ్డారు.

(ఈ రచన కేవలం ప్రజల మూఢనమ్మకాలను దృష్టిలో పెట్టుకుని వ్రాసింది. అడుగు గుడి గుడికో దేవత, దేవతకో చరిత్ర సృష్టించి పూజలు జరిపే గ్రామీణ ప్రజలు చైతన్యవంతులు కావాలని మూఢనమ్మకాలకు అమాయకులను బలిచేయకుండా కొంత మానవత్వాన్ని పెంపొందించుకోవాలని కోరుతూ...)

– విశాలాంధ్ర

తేది 17-9-2000